క్లుప్తంగా

విద్యా ప్రదాత ఎన్‌బీకేఆర్



బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

కోట: పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు వెలకట్టలేనివని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం ఎన్‌బీకేఆర్ 46వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి అధ్యాపకులు, సిబ్బంది నివాళులర్పించారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణారెడ్డి ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలను స్థాపించి ఎందరో పేద విద్యార్థులకు విద్యను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, హరనాథ్‌రెడ్డి, శ్రీనివాస్, కిషంధర్ పాల్గొన్నారు.

బాలకృష్ణారెడ్డికి నివాళి



బాలకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి వర్ధంతిని శనివారం వాకాడులో నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని సమాధి వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, హెచ్‌ఎం ప్రవీణ్ కుమార్, దారా అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టీబీ సోకకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలి

రాపూరు: 18 నుంచి 60 ఏళ్లలోపు వారు టీబీ సోకకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజకుమారి తెలిపారు. తానంచర్లలో శనివారం బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ టీకాను వేస్తున్నట్లు చెప్పారు. టీబీ నిర్మూలనకు మందులు వాడి తగ్గిన వారికి, ధూమపానం, పొగాకు అలవాటు ఉన్నవారికి ఈ టీకా వేస్తున్నట్లు తెలిపారు.

భూ ఆక్రమణను అడ్డుకోవాలని నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కోట: పేదలకు ఇచ్చిన భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిట్టేడు పంచాయతీ వజ్జావారిపాళెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వజ్జావారిపాళెంలో ఉన్న అటవీ పోరంబోకు భూమిని 20 మంది సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కొందరు తమపై బెదిరింపులకు దిగుతూ ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అనంతరం డీటీ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు.

కౌలు రైతులకు రుణాల మంజూరుపై అవగాహన

పెళ్లకూరు: కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఏవో డాక్టర్ ప్రవీణ తెలిపారు. చెంబేడులో శనివారం కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరుపై అవగాహన కల్పించారు. భూమిని కౌలుకు తీసుకున్న రైతులు రెవెన్యూ, వ్యవసాయ అధికారులను సంప్రదించి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని తెలిపారు. తద్వారా వారికి బ్యాంకు నుంచి రుణం మంజూరు అవుతుందన్నారు. మల్లికార్జున్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, మునీంద్ర, బాలాజీ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్ : మండలంలోని జాతీయ రహదారిలో పండ్లూరు వద్ద ఉన్న దాబాలో శుక్రవారం రాత్రి పవన్‌కుమార్(42) అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రాజస్థాన్ ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్ కపూర్ డీజిల్ కార్పొరేషన్ చెందిన లారీకి డ్రైవర్‌గా పనిచేసున్నాడు. బెంగళూరులో లోడింగ్ చేసుకుని కోల్‌కతా బయలుదేరాడు. శుక్రవారం రాత్రి పండ్లూరు గ్రామం వద్ద ఉన్న దాబాలో భోజనం చేసుకుని అక్కడే నిద్రించాడు. శనివారం ఉదయం ఎంతకీ నిద్ర లేవకపోవడంతో మృతి చెందినట్టు గుర్తించి అటుగా వెళుతున్న అదే కార్పొరేషన్‌కు చెందిన మరో లారీ డ్రైవర్‌కు విషయాన్ని చెప్పారు. మృతుని సోదరుడు మనోజ్‌కుమార్ నాయుడుపేటకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ గోపి అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి కష్టాలు తీరేనా..?

సూళ్లూరుపేట పట్టణంలో తాగునీటి వ్యాపారం మూడు పూలు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. రోజువారి కూలీ అయినా తాగు నీరు కొనాల్సిందే. ప్రభుత్వం నిర్వహిస్తున్న తాగునీటి పథకాలు అధికారుల పర్యవేక్షణ లోపంతో కునారిల్లుతున్నాయి. దీంతో బిందె నీరు రూ.5లకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. సూళ్లూరుపేట మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా స్థాయి మారినా ప్రజల సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. పట్టణంలో సుమారు 15 వేలు కుటుంబాలుండగా రోజుకు రూ.20 లెక్కన నెలకు సుమారు రూ.కోటి వరకు నీటి కోసం ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

- సూళ్లూరుపేటలో బిందెనీరు రూ.5లు
- నిరుపేదలైనా నీరు కొనాల్సిందే
- పన్నుల మోత మోగిస్తున్న అధికారులు
- ప్రజలకు సమస్యల వాత



నీరు లేక ఎండిపోయి ఎడారిలా దర్శనమిస్తున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. ఇక్కడ అధికారికంగా సుమారు 48 వేల మంది, అనధికారికంగా మరో 30 వేల మందికి పైగా జనాభా వున్నారు. ప్రజల అవసరాలకు తగినట్టు తాగునీటి వనరుల్లేవు. పట్టణంలో పది ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి. ఇందులో మన్నారుపోలూరు న్యూకాలనీ, ఇందిరానగర్, సూళ్లూరు, బాపూజీకాలనీకి సంబంధించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలమై ప్రమాదకరంగా మారడంతో కూల్చివేశారు. వాటి స్థానంలో కొత్తవి నిర్మించలేదు. సమ్మర్ స్టోరేజీ నుంచి, ఇతర సోర్సుల నుంచి రోజుకు 16 లక్షల లీటర్ల నీరు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా అవి అందరికీ అందడం లేదు. పట్టణంలో అక్రమంగా మోటార్లు పెట్టి తోడేయడంతో శివారు ప్రాంత ప్రజలకు అరకొరగా అందుతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఒక మనిషికి రోజుకు 70 లీటర్ల చొప్పున 48 వేల మంది జనాభాకు సుమారు 34 లక్షల లీటర్లు నీరు అవసరం అవుతుంది. ప్రస్తుతం 10 లక్షల లీటర్ల నీరు కూడా అధికారులు అందించలేకపోతున్నారు. దీంతో ప్రజలు క్యాన్ నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ఈ క్రమంలో తాగునీటి వ్యాపారం చేసే కంపెనీలు నెలకు రూ.కోట్లు ఆర్జిస్తున్నాయి.



ఏఐఐబీ నిధులు రూ.142 కోట్లతో పనులు చేస్తున్నట్టు 2019లో వేసిన శిలాఫలకాలు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు నీరు వచ్చే దారేదీ..

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు నీటిని నింపేందుకు తెలుగుగంగ బ్రాంచి కాలువను తీసుకొస్తున్నామని చెప్పిన అప్పటి టీడీపీ, కాంగ్రెస్ నేతల మాటలు నీటి మూటలుగా మిగిలాయి. సూళ్లూరుపేట మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారడంతో తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మున్సిపాలిటీకి అప్పగించారు. దీంతో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు దాహార్తి తీరలేదు. షార్ నిధులు రూ.117 కోట్లతో 7.50 లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన ఐదు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, 18 కిలో మీటర్ల పైపులైన్ విస్తరించేందుకు చేసిన ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితమయ్యాయి. 2013 ఏప్రిల్‌లో సూళ్లూరుపేటకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.75 కోట్లు మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ సీఎం కార్యాలయం నుంచి బయటకు రాలేదు. 2019 ఎన్నికల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏషియన్ ఇన్వెస్టిమెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంక్ నుంచి రూ.142 కోట్లు మంజూరు చేసి కొంతమేర పనులు చేసినప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు.

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో రాజీవ్ పల్లెబాటలో భాగంగా సూళ్లూరుపేట వచ్చారు. స్థానికుల వినతి మేరకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేశారు. కోటపోలూరు పెద్దన్నగారి చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించారు. దీనికింద తల్లంపాడు, కళాక్షేత్రంలో 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్‌బీఆర్ ట్యాంకులున్నాయి. వీటికి అనుసంధానంగా 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఇందిరానగర్, బాపూజీ కాలనీ, సాయినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నాయి. కళాక్షేత్రంలో 2.50 లక్షల కెపాసిటీ కలిగిన బాలెన్సింగ్ ఓవర్‌హెడ్ ట్యాంక్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా ఉన్నాయి. కోళ్లమిట్టలో 1.20 లక్షలు, మన్నారుపోలూరులో 90 వేలు, 60 వేలు, వత్రపాళెంలో 40 వేల సామర్థ్యం

నిరుపయోగంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్



నిరుపయోగంగా ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి. సూళ్లూరు, ఇందిరానగర్ ప్రాంతాల్లో వున్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు శిథిలమై పోవడంతో కూలదోసి కొత్తవి నిర్మించలేదు. దీంతో నీటిని డైరెక్ట్ పంపింగ్ చేస్తున్నారు. దీనికి తోడు బాపూజీ కాలనీ, రాఘవయ్యపేటకు నీరు అందించే ఓవర్ ట్యాంక్ శిథిలమైపోవడంతో నిరుపయోగంగా మారింది. మన్నారుపోలూరు న్యూకాలనీలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రారంభించకుండానే శిథిలమైంది. ఈ ట్యాంకులకు సమ్మర్ స్టోరేజీ నుంచే కాకుండా తల్లంపాడు, చిన్నసత్రం, చెల్లమ్మబొంద, పందలగుంట, కొన్నెంబట్టు వద్ద వేసిన బోర్లు, సంప్ హౌస్‌లను సోర్సులుగా ఏర్పాటు చేశారు. చెరువులో నీరున్న సమయంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు నింపి వేసవిలో నీరు ఇవ్వాల్సి వుండగా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

కాలువల్లో పూడికతీత

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పలు ప్రధాన మురుగు కాలువల్లో శనివారం పూడికతీత పనులు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. స్వర్ణముఖి నది నుంచి పట్టణ పరిధిలో ఉన్న విన్నమాల కాలువ (సప్లయి చానల్)లో జేసీబీలతో చేపట్టిన పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీటితోపాటు కాలువల్లో మురుగు నీరు సాఫీగా వెళ్లేలా పూడిక తీయిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాల్లో క్రిమీలేయర్ వర్తింప చేయాలి

దక్కిలి: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాల నియామకాల్లో క్రిమీలేయర్ వర్తింపజేయాలని దక్కిలి క్రిమీలేయర్ సాధన కమిటీ సభ్యులు కోరారు. వారు శనివారం దక్కిలిలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు క్రిమీలేయర్‌ను అమలు చేసేలా ఏపీ ప్రభు త్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. క్రిమీలేయర్ లేకపోవడంతో 75 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాల్లో ఎంతో మంది దళిత నిరుపేదలు నష్టపోతున్నారని వాపోయారు. కమిటీ సభ్యులు ముజీబ్, జీ మధు, వై శ్రీనివాసులు, కే మస్తాన్, దండోలు కృష్ణ, డీ సునీల్ కుమార్, మునీంద్ర, ఎస్ రత్నయ్య పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత మోమిడి

చిల్లకూరు : మోమిడిలో ఉన్న క్రీడా మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో విజేతగా మోమిడి జట్టు నిలిచింది. మోమిడి, బల్లవోలు జట్లు తలపడగా మొదటగా బ్యాటింగ్ చేపట్టిన మోమిడి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్లు నష్ట పోయి 90 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బల్లవోలు జట్టు 11.3 ఓవర్లలోనే 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు మాత్రమే చేసింది. నిర్వాహకులు మోహన్, వినోద్, నాగరాజు, నిరీక్షణ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై దుండగుల హల్‌చల్



గాయపడిన డ్రైవర్ మల్లికార్జునరావు

దొరవారిసత్రం : మండలంలోని జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి ముగ్గురు దుండగులు మాస్కులు ధరించి బైక్‌లపై తిరుగుతూ పలుచోట్ల దోపిడీకి యత్నించారు. తల్లంపాడు సమీపంలోని టోల్ ప్లాజా వద్ద రోడ్డు పక్కన లారీ నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్ మల్లికార్జునరావుపై రాళ్లతో దాడి చేసి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతని వద్ద ఏమీ లేకపోడంతో వదిలి వెళ్లిపోయారు. అలాగే అక్కరపాక రోడ్డు సమీపంలో ఉన్న ఐఓసీ పెట్రోల్ బంకు సిబ్బందిపై దాడి చేసి దోపిడీకి ప్రయత్నించారు. దుండగులు మాస్కులు ధరించి తమిళంలో మాట్లాతున్నట్లు పెట్రోల్ బంకు సిబ్బంది తెలిపారు. అదేవిధంగా నెలబల్లి సమీపంలోని తెలుగు గంగ కాలువ వద్ద చెంచురత్నం దుకాణాన్ని ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. గత నెలలో టపాయిండ్లు సమీపంలో దుకాణం ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్న మహిళ మెడలోని ఐదు సవర్ల బంగారు చైన్‌ను బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని ఇద్దరు దుండగులు లాక్కెల్లారు. వరుస సంఘటనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

వెంకటగిరి రూరల్ : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. మండలంలోని నీలకంఠాపురంలో శనివారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించేందుకు హక్కులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని, మహిళలకు సరైన వైద్యం అందకపోతే కోర్టును ఆశ్రయించాలని సూచించారు. అనంతరం జీకేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాది అద్దంకి గాంధీ, ఏఎస్‌ఐ రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శ



కోటారెడ్డిని పరామర్శిస్తున్న మేరిగ మురళీధర్

కోట: మండలంలోని ఊనుగుంటపాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తన్నమాల కోటారెడ్డి తండ్రి రమణారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ శనివారం వారి నివాసానికి వెళ్లి కోటారెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వెంకన్నపాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ కనుపూరు జగదీష్ నాన్నమ్మ సుబ్బమ్మ ఇటీవల మరణించారు. ఈ క్రమంలో వారి నివాసానికి వెళ్లి జగదీష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ మొబీన్, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



దాసును పరామర్శిస్తున్న నేతలు

దాసుకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

సైదాపురం: వైఎస్సార్ సీపీ తిరుపతి కార్యాలయంలో పనిచేస్తున్న తిరిపి దాసు కుటుంబాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కళాకారులు పరామర్శించారు. ఇటీవల తిరిపి దాసు భార్య, ఇద్దరు పిల్లలు తమ్ముడి చేతిలో హత్యకు గురయ్యారు. అలాగే తమ్ముడు కూడా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దాసు మండలంలోని గంగదేవిపల్లిలో ఉన్నాడు. నాయకులు గ్రామానికి చేరుకుని దాసును ఓదార్చారు. వీఎస్ భరద్వాజ్, కన్నెప్పగారి కేశవులురెడ్డి, ఓలేటి చంద్రబాబునాయుడు, శాంబోలు హరినాథ్, బత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లు

కలువాయి: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూరవిద్య విధానం కింద పదవ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేస్తున్నట్టు చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.జనార్దన రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మధ్యలో బడి మానేసిన వారు, పదవ తరగతి ఫెయిల్ అయిన వారు, సామాజికంగా వెనుకబడిన వారు మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలవారు తమ పాఠశాలలో ఏ1 కోఆర్డినేటర్‌ను సంప్రదించాలన్నారు. నమోదుకు ఆగస్టు 27వ తేదీ తుది గడువు అని, అపరాద రుసుముతో సెప్టెంబరు 4వ తేదీ వరకు గడువు ఉందని వెల్లడించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



చిల్లకూరు : సీఎస్ఆర్ కింద విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు జిందాల్ పవర్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. తమ్మినపట్నంకు చెందిన విద్యార్థి రామినేని క్రాంతి కిరణ్ ఉన్నత చదువుల కోసం శనివారం రూ.1.20 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే పరిశ్రమ ప్రతినిధులను అభినందించారు. భవిష్యత్తులో సీఎస్ఆర్ కింద ప్రజల అవసరాలను తీర్చేలా చూడాలని సూచించారు.

చిట్టమూరులో..

చిట్టమూరు (చిల్లకూరు) : మండలంలోని బయ్యావారికండ్రిగకు చెందిన ఓజిలి శ్రీనివాసులు కుమార్తె మోనిష పుట్టిన రోజు సందర్భంగా ఇంటర్ చదువుతున్న ఇద్దరు పేద విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు సాయం అందించారు. టీఎంఆర్ పాఠశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయం అందిస్తే వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



క్రీడా దుస్తులు ధరించిన విద్యార్థులతో రోటరీ వెస్ట్ క్లబ్ ప్రతినిధులు

చిల్లకూరు : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులకు శనివారం గూడూరుకు చెందిన రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ చల్లా రామ్‌కుమార్ దాతృత్వంతో క్రీడా దుస్తులు అందజేసినట్టు తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు, జోనల్ కార్యదర్శి బండి ధనుంజయరెడ్డి, క్లబ్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, సభ్యులు రవీంద్రారెడ్డి, బలరామిరెడ్డి, వాసు, హెచ్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మౌనిక చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

వెంకటగిరి రూరల్ : మౌనిక చారిటబుల్ ట్రస్టు పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. వెంకటగిరి పట్టణం 21వ వార్డులో మౌనిక చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ మౌనికారెడ్డి ఆధ్వర్యంలో దేవిసి ఫుడ్స్ లిమిటెడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ట్రస్టు చైర్ పర్సన్ మౌనికారెడ్డి మాట్లాడుతూ పేదలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలన్న ఉద్దేశంతోనే ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సంగమేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌షరీద్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కోట: గూడలి వద్ద స్వర్ణముఖి నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు సన్మానం




రాజేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి, కిలివేటి సంజీవయ్య యువసేన కన్వీనర్ పోట్లాపూడి రాజేష్‌ను శనివారం రాత్రి ఆ పార్టీ నేతలు పట్టణంలోని ఎస్‌జే కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. రాజేష్ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. అభిరామ్ అనే కార్యకర్త రక్తంతో చిత్రీకరించిన రాజేష్ చిత్రపటాన్ని బహూకరించాడు. నాయకులు గోనుపల్లి గురుమూర్తి, స్నేహితులు సాయి రామ్ కిషోర్, బాబు, చంద్రశేఖర్, విన్నమాల బాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

సైదాపురం/రాపూరు : నిమ్మతోటల్లో యజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి గోవిందరాజులు తెలిపారు. ఆయన శనివారం ఉద్యాన శాఖాధికారులతో కలిసి సైదాపురం మండలంలోని చాగణం, కొమ్మిపాడు గ్రామాలు, రాపూరు మండలం సిద్ధవరంలో నిమ్మ పూత నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గిబ్బరెల్లిక్ ఆమ్లం, సైకోసెల్, 13.0.45లో ఉపయోగాలు, వాటి వాడుక విధానంపై రైతులకు వివరించారు. కొత్తగా నిమ్మ తోటలు సాగు చేసే వారు వర్షాలను బట్టి జూలై నుంచి ఫిబ్రవరి వరకు మొక్కలు నాటుకోవచ్చన్నా రు. పొదలకూరు ఉద్యానశాఖాధికారి ఆనంద్, లక్ష్మిసాయి మిదుల, శాస్త్రవేత్తలు తిరుపాల్, రాజీవన్, వ్యవసాయ సిబ్బంది తేజేశ్వర్‌రెడ్డి, తేజ, రైతులు మధుసూదన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధం



దక్కిలి: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వాకాడు : తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ తెలిపారు. వాకాడులోని పాత, కొత్త హరిజనవాడ అంగనవాడీ కేంద్రాల వద్ద శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కొండమ్మ, షాలిని, అంగనవాడీ కార్యకర్తలు చెన్నమ్మ, మమత, కవిత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఏపూరు లోని అంగనవాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: చంటి పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. ఓజిలి ఎస్ఎస్ఆర్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సుజన, డాక్టర్ డానియల్ రాజు, వైద్య సిబ్బంది భాస్కర్, చందన, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, విజయ, పద్మ పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : చిన్నారులకు తల్లిపాలు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మీ తెలిపారు. చిల్లకూరు, వడ్డిపాళెంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. సీహెచ్‌వో రజిత, అంగన్‌వాడీ వర్కర్లు మల్లెమ్మ, మహాలక్ష్మీ, రుక్మిణి, సుజాత పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారిణి శ్రావణి తెలిపారు. రామసాగరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు.

దక్కిలిలో..

దక్కిలి: తల్లి పాలు బిడ్డకు అమృతమని సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. మండలంలోని అల్తూరుపాడు 1, 2, దగ్గవోలు 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు పరిమళ, కల్పలత, పంచాయతీ కార్యదర్శి శిరీష, అంగన్‌వాడీ వర్కర్స్ సుభాషిణి, రాఘమ్మ, ఉష, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఎల్‌పి సాగరం అర్బన్ వైద్యశాల వైద్యులు సుబ్బారావు తెలిపారు. నాయుడుపేటలోని లోతువానిగుంట కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఏఎన్‌ఎం హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.శాంతి, ఎం.లీలావతి, మహిళా పోలీసు వి.చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోటలో..

కోట: మండలంలోని పుచ్చలపల్లిలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది అనిత, మల్లికార్జునమ్మ, వాణి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల ఎంతో మేలు కలుగుతుందని ఏసీడీపీవో జ్యోతికిరణ్ తెలిపారు. మండలంలోని బూదనం, ఏరూరు అల్లీపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగిశెట్టి రేణుక, శివజ్యోతి, ఏఎన్‌ఎం ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు సబ్సిడీ

బాలాయపల్లి(సైదాపురం) : ఆయిల్ పామ్ సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్ తెలిపారు. ఆయన శనివారం బాలాయపల్లి మండలంలోని పిగిలాం, కొత్తూరు, జార్లపాడులో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చ ని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యానవశాఖ ద్వారా రైతులకు సబ్సిడీతో యూనిట్‌లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వెంకటగిరి సబ్‌డివిజన్ పరిధిలో తీర్థంపాడు, గొట్లగుంట గ్రామాల్లో సుమారు 30 ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నట్లు తెలిపారు.

హోరా హోరీగా క్రికెట్ పోటీలు



నాటౌట్‌గా నిలిచిన ధరణి కుమార్

వెంకటగిరి రూరల్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో సౌత్ జోన్ సీనియర్ విభాగంలో క్రికెట్ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లో కడప– చిత్తూరు జట్ల మధ్య పోటీ నెలకొంది. ఓవర్‌నైట్ క్రీడా పోటీల్లో కడప జట్టు 79 ఓవర్లకు 325 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో శ్రీకాంత్ 81, ఎస్ఎండీ రఫీ 56, వరత్ రెడ్డి 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన చిత్తూరు జట్టు 37 ఓవర్లకు 154 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో ధరణికుమార్ 71, అశ్లాం 55 పరుగులు చేశారు. 56 పరుగుల తేడాతో కడప జట్టు ఆధిక్యంలో ఉంది.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

సూళ్లూరుపేట రూరల్ : భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి కేవీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన శనివారం నెల్లూరు జిలా ఆత్మ సహకారంతో సూళ్లూరుపేట మండలం కోటపోలూరులో రైతులకు భూసార పరీక్షలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితం ఆధారంగా ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుస్తుందన్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ అనిత మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. హిమబిందు, నాగరాజు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.